# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 215 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 31 జులై 2026


## శ్రీనగర్ 154వ బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం




## ఎల్జీ "ఓఎల్ఇడి ఏఐ" అత్యాధునిక టీవీలు ఆవిష్కరణ






## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**- జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులకు సి.ఎస్. ఆదేశం**

**హైదరాబాద్,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన మిగతా2లో...

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

- ● సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- ● ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
- ● నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ● ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ

**హైదరాబాద్,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మిగతా2లో...





## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మిగతా2లో...

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

**- లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు**



**న్యూఢిల్లీ,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం మిగతా2లో...

## హిందుత్వ అంటే మన జీవనవిధానం

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య**

**విజయవాడ,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాటామంతిలో పాల్గొని మిగతా2లో...



## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర




గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన మిగతా2లో...

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక




## నేను విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి?: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** 2034 వరకు తెలంగాణ సీఎంగా తానే ఉంటానని రేవంత్‌రెడ్డి అన్నారు. ఫిన్లాండ్, జర్మనీ టీచర్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై మాట్లాడారు. "నేను విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి? పిల్లలకు అల్పాహారం అందించినందుకు రాజీనామా చేయాలా? ఐటీఐలను కాకుండా ఏటీసీలను ఏర్పాటు చేసినందుకా? మండలాల్లో విద్యాభివృద్ధికి ఏం కావాలో ఉపాధ్యాయులు సలహాలు ఇవ్వండి. టీచర్ల సలహాలను అధికారులు అమలు చేస్తారు. విద్యారంగంపై ఖర్చు పెట్టడానికి నాకు ఇబ్బంది లేదు." అని అన్నారు.

## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన**



**హైదరాబాద్ ,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. మిగతా2లో...

## వర్షాలతో రైతులకు ఊరట

- ●ఆరుతడి పంటల ప్రోత్సాహానికి చర్యలు
- ●రైతుల జీవనోపాధికి సంబంధించి పలు సూచనలు
- ●సిఎంకు సమర్పించిన నివేదికపై చిన్నారెడ్డి వివరణ




**హైదరాబాద్ ,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు. రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు మిగతా2లో...

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక పక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్ధవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

**(మొదటి పేజీ తరువాయి)**

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది.

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్పిం÷–రక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షిం చేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి బోధి సెంటర్ లో అందజేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్ లో నిపుణుల కమిటీ ఛైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# వర్షాలతో రైతులకు ఊరట

**(మొదటి పేజీ తరువాయి)**

కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున, నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను గ్రామాల వారీ కార్యాచరణ ప్రణాళికతో విస్తృతంగా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై రైతులకు అందించాలని సిఫార్సు చేసింది. వరి సాగును నీటి లభ్యత ఆధారంగా పరిమితం చేయడంతో పాటు డ్రిప్, స్పిం÷–రక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ్ ఫరో, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, భూగర్భ జలాల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నివేదిక సూచించింది. ఉద్యాన పంటల సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. తక్కువ వ్యవధి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పట్టుపరిశ్రమ ఆధారిత సాగును ప్రోత్సహించాలని, డ్రిప్ ఇరిగేషన్, శాశ్వత పందిళ్లు, షేడ్‌నెట్ హౌస్‌లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు సబ్సిడీలు అందించాలని సూచించింది. పశుసంవర్ధక రంగంలో పశుగ్రాస కొరత తలెత్తకుండా జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగును విస్తరించడం, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ, పశువులకు తాగునీటి వసతుల కల్పన వంటి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జలాశయాల్లోని నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలని నివేదిక పేర్కొంది. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రవేత్తలు సమన్వయంతో రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సాంకేతిక సూచనలు నిరంతరం అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సూచించింది. అదేవిధంగా, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు, పంటలు, తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైతే మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపాదించిన ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే అమలు చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, పశుగ్రాస లభ్యత, గ్రామీణ ఉపాధి పరిరక్షణతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత స్థిరంగా నిలబెట్టవచ్చని కమిటీ పేర్కొంది. కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదికలో అంచనా వేసింది.

# గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

## తయారీదారులను ఆదేశించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

**హైదరాబాద్,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుండి. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణేశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనార్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణేశ్ విగ్రహాలను ప్రతిష్టించినట్లు వివరించారు. విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్ఠాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. దూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లై ఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని



ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉప యోగించే క్రేన్లు, వాహనాలు సర్టి÷డ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

# వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

**(మొదటి పేజీ తరువాయి)**

కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

# హిందుత్వ అంటే మన జీవనవిధానం

**(మొదటి పేజీ తరువాయి)**

వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తివంతమైన భారత్ కావాలంటే యువతి, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్‌లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**(మొదటి పేజీ తరువాయి)**

ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రధానంగా, ఆయా జిల్లాలో వాటర్ ఫాల్స్, ప్రమాదకర ప్రదేశాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తుండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే, ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనప్పుడు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

**(మొదటి పేజీ తరువాయి)**

క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

**(మొదటి పేజీ తరువాయి)**

సీసీ రోడ్, లో – లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

**పుణె,జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు.

ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷–లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు.

# కరీంనగర్ పోలీసు కమీషనరేట్ గంగాధర పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీ చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం





**గంగాధర జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని గంగాధర పోలీసు స్టేషన్ ను గురువారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ వార్షిక తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ కు విచ్చేసిన కమీషనర్ కు స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గార్డ్ అందించిన గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగారు. పోలీస్ స్టేషన్ లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించబడిన విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలని సూచించారు.తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా ఉపయోగించే సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ మరియు అమలు, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్, దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక మరియు ఆర్థికేతర నేరాల సమాచారం, సీడీఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్/అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలన్నారు. పోలీస్ స్టేషన్ కి కేటాయించబడిన పరికరాలను, అలాగే పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ ను బ్లూ కోల్ట్స్ సిబ్బంది వినియోగించే తీరును పరిశీలించారు. ఎఫ్ ఐ ఆర్ ( ఎఫ్ ఐ ఆర్ ) ఇండెక్స్ ని పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. కేసుల ఆలస్యానికి గల కారణాలు తెలుసుకుని, త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదైన సైబర్ నేరాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గంగాధర పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణలతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సీరోల్‌లో ఘనంగా ముగిసిన ఇన్-సర్వీస్ టీచర్ ట్రైనింగ్

**శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలి..**

**ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం: సీరోల్ ఎంఈవో లచ్చిరాం**



**మహబూబాబాద్ జిల్లా, జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండల కేంద్రంలో ఈ నెల 23వ తేదీ నుంచి మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కోసం రెండు విడతలుగా నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం గురువారం ఘనంగా ముగిసింది.ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సీరోల్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) లచ్చిరాం మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రతిరోజూ సాయంత్రం ఒక గంట పాటు రెమెడియల్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలోని చతుర్విధ ప్రక్రియలపై పూర్తి పట్టు సాధించేలా కృషి చేయాలని, విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శిక్షణలో ఆర్యులుగా (రిసోర్స్ పర్సన్స్‌గా) సేవలందించిన వారిని, అలాగే స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బంగారినిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు విద్యా సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా నూతన మైసమ్మ దేవాలయ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు...

**- వేడుకల్లో పాల్గొన్న మేయర్ కోలగని శ్రీనివాస్**






**కరీంనగర్ జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పదో డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మైసమ్మ దేవాలయ అమ్మవారి ప్రతిష్టా మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. అమ్మవారి ప్రతిష్ట మహోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ,స్థానిక కార్పొరేటర్ కొమరయ్య లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్టా కార్యక్రమాలను కన్నుల పండుగగా చేపట్టారు. కాలనీ ప్రజలు అందరూ కలిసికట్టుగా పండుగ వాతావరణంలో అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేయడంతో దేవాలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను ఇస్తాయని తెలిపారు. స్థానిక కాలనీవాసులందరూ ఐక్యతతో ముందుకు వచ్చి నూతన దేవాలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు.అమ్మవారి ఆశీస్సులు కరీంనగర్ నగర ప్రజలందరిపై ఉండాలని, నగరం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక కాలనీ పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శ్రీనగర్ 154వ బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం

**రీ-నామినేషన్ ఫారాల సమర్పణ 100% పూర్తి అన్ని పార్టీల బీఎల్ఏ-2ల సమిష్టి కృషికి సర్పంచ్ ఆకుల మల్లేష్ అభినందనలు**



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**శ్రీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 154వ పోలింగ్ బూత్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రీ-నామినేషన్ ఫారాల సమర్పణ ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏ-2లు సమిష్టిగా పూర్తి చేసిన రీ-నామినేషన్ ఫారాలను బీఎల్ఓ బత్తోజు ఉమా గారికి అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఆకుల మల్లేష్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేయడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదవడం అత్యంత కీలకమని, ఆ దిశగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏ-2లు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తిచేయడంలో విశేషంగా కృషి చేసిన బీఎల్ఓ బత్తోజు ఉమా గారికి, అన్ని పార్టీలకు చెందిన బీఎల్ఏ-2లకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎన్నికల సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ఇదే స్ఫూర్తితో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె. స్వర్ణ, వీవో ఏ. అరెల్లి ఉమా, బీజేపీ తరఫున బైకాని మహేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ తరఫున గుగులోత్ లచ్చిరాం, బీఆర్ఎస్ పార్టీ తరఫున భూక్య దేవేందర్, అలాగే గుగులోత్ ఈరు, మడిపోజు వెంకన్న, దాసరి రాజయ్యతో పాటు అన్ని పార్టీల బీఎల్ఏ-2లు, గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు విలువైనదనే సందేశంతో శ్రీనగర్ గ్రామం ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.



# ఎల్జీ “ఓఎల్ఇడి ఏఐ“ అత్యాధునిక టీవీలు ఆవిష్కరణ

**కాజీపేట, జూలై 30(పిసిడబ్ల్యూ న్యూస్):**హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తన కొత్త తరం అత్యాధునిక ‘ ఓఎల్ఇడి ఏఐ‘ టీవీలను కాజీపేట మార్కెట్‌లోకి గురువారం అధికారికంగా విడుదల చేసింది. కాజీపేట డి-మార్ట్ సమీపంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ కోల శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోల శ్రీధర్ మాట్లాడుతూ... అత్యాధునిక ఆల్ఫా ఓఎల్ఇడి ఏఐ ప్రాసెసర్, ప్రపంచ స్థాయి ఓఎల్ఇడి డిస్‌ప్లే సాంకేతికతతో రూపొందించిన ఈ టీవీలు వినియోగదారులకు సరికొత్త వీక్షణ అనుభూతిని అందిస్తాయని తెలిపారు. సహజ సిద్ధమైన రంగులు, పర్‌ఫెక్ట్ బ్లాక్ లెవెల్స్, పిక్చర్ క్వాలిటీ వీటి ప్రత్యేకత అని వివరించారు.అలాగే ఈ టీవీల్లో ఏఐ పిక్చర్ ప్రో, ఏఐ సౌండ్ ప్రో, అప్‌డేటెడ్ webOS స్మార్ట్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు గేమింగ్ ప్రియుల కోసం హై-రిఫ్రెష్ రేట్, లో-ల్యాటెన్సీ వంటి పలు ప్రీమియం ఫీచర్లు ఉన్నాయని పేర్కొన్నారు. **అందుబాటులో ఉన్న సైజులు** C-సిరీస్: 42, 48, 55, 65, 77, 83 అంగుళాలు G-సిరీస్: 55, 65, 77, 83, 97 అంగుళాలు ఉన్నాయి.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్ మేనేజర్ రఘువీర్, స్టోర్ మేనేజర్ స్వామి, సందీప్, ఎల్జీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీవీ మోడళ్ల ప్రత్యేకతలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

# కరీంనగర్ కళాకారుల బోనాల జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**- ఆగస్టు 5న బోనాల ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలకు ఘన ఏర్పాట్లు**



**కరీంనగర్ జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కళాకారుల ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీన నిర్వహించనున్న కరీంనగర్ కళాకారుల బోనాల జాతర పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఆగస్టు 5న ఉదయం 9 గంటలకు గీతాభవన్, తెలంగాణ చౌక్ నుంచి బోనాల ర్యాలీ ప్రారంభమై కోతిరంపూర్ పోచమ్మ ఆలయం వరకు కొనసాగుతుందని, అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించనున్నట్లు తెలిపారు.అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు (ఆటపాట) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని బోనాల జాతరను విజయవంతం చేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోగుల ప్రసాద్, బాబు గౌరవేణి, సంతోష్ తమ్మిశెట్టి, అభినవ్ కొత్తకొండ, తిప్పబత్తిని రవి, చిలివేరి శ్రీకాంత్, యతిరాజు, దేవరాయ శ్రీనివాస్, దాసం అజయ్, సంద స్వప్న, గాజుల ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం...


**- 50వ డివిజన్ కార్పొరేటర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు**





**కరీంనగర్ జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా 50వ డివిజన్ కార్పొరేటర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో విద్యుత్ తీగలు, స్తంభాలకు ప్రమాదకరంగా మారిన చెట్లను, కొమ్మలను తొలగించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రవీణ్ రావు చేపట్టారు. ఈ పనులను స్వయంగా పరిశీలించి, మున్సిపల్ సిబ్బంది కి తగిన సూచనలు అందించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడి షార్ట్ సర్క్యూట్లు జరిగే ప్రమాదం ఉన్న ప్రాంతాలను డివిజన్లో గుర్తించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ వల్ల డివిజన్ ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో ప్రమాదకర చెట్ల కొమ్మలను తొలగించినట్లు చెప్పారు.డివిజన్‌లో విద్యుత్ సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నా, లేదా ప్రమాదకరంగా మారిన చెట్లు ఎక్కడైనా ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలనీ, ప్రజల సౌకర్యార్థం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బోయిన్పల్లి ప్రవీణ్ రావు తెలిపారు.మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక బిజెపి నాయకులు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్ఓసి మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..


VEMULA SRINIVASULU, LLM., MBA., O.S.D. TO CHIEF MINISTER GOVERNMENT OF TELANGANA

Room No.3, 6th Floor, Dr.B.R.Ambedkar Telangana Secretariat Hyderabad Ph.No. 040-23450468 Fax No. 040-23459944

CHIEF MINISTER'S OFFICE

Lr. No.10248/CMRF-LOC/2026, Dated:30-07-2026

To
The Director,
M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82.

Sir,

Sub:- CMRF-Sanction of LOC Under CMRF to M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82 towards treatment of individuals-Reg.

Ref:- 1. Letter from the SRI SRINIVAS AADI , Hon'ble MLA VEMULAWADA - GOVT WHIP, dt:28-07-2026

The Hon'ble Chief Minister desires that the treatment of Dyavanapelli Nagaraju, S/O POSHETTI, H.NO. 10-1-76, SAINAGAR, RAJANNA SIRCILLA be extended as the Hon'ble Chief Minister has assured for sanction of an amount of Rs. 5,00,000/- (Rupees Five Lakh Only) to undergo AICD

Necessary action may please be taken for providing treatment to the individual and send the bill after completion of the treatment.

With best wishes,

Yours sincerely,
(Vemula Srinivasulu)

Copy to:
SRI SRINIVAS AADI ,
Hon'ble MLA VEMULAWADA - GOVT WHIP
Copy to:
Dyavanapelli Nagaraju
S/O POSHETTI
H.NO. 10-1-76, SAINAGAR, RAJANNA SIRCILLA

Note:- This letter does not require physical signature and this certificate can be verified by scanning QR code printed on this letter.

**రాజన్న సిరిసిల్ల జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సాయినగర్ సిరిసిల్ల నివాసి అయిన ద్యావనపల్లి నాగరాజు గా/శ్రీ పోశెట్టి అనారోగ్యంతో అత్యవసర చికిత్స అవసరమైన విషయం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించారు.నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుండి 5,00,000 రూపాయల విలువ గల గాజ ను వైద్య ఖర్చుల కోసం వెంటనే మంజూరు చేయించారు.ఈ సహాయం అందించడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల సంఖ్యలో ప్రభుత్వ బడులకు భారీ గండి

**60 ప్రభుత్వ పాఠశాలలు... 8 ప్రైవేట్ స్కూళ్లు..!**

**ప్రభుత్వ బడులు వెలవెల... ప్రైవేట్ బడులు కళకళ..!**

**60 ప్రభుత్వ పాఠశాలల్లో 2,316 మంది... 8 ప్రైవేట్ స్కూళ్లలో 3,599 మంది విద్యార్థులు**

**ప్రభుత్వ విద్యకు మోగుతున్న ప్రమాద ఘంటిక..!**

**ప్రభుత్వ బడులకు గండం..!: సింగిల్ డిజిట్ విద్యార్థులతో పలు పాఠశాలలు...**

**ప్రైవేట్ స్కూళ్లకు పెరుగుతున్న ఆదరణ**







**కల్లూరు, జులై 30 (పీసీడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కల్లూరు మండలంలోని విద్యార్థుల నమోదు గణాంకాలు మాత్రం అందుకు పూర్తి భిన్నమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 2,316 మంది విద్యార్థులు మాత్రమే చదువుతుండగా, కేవలం మండలములో 8 ప్రైవేట్ పాఠశాలల్లోనే 3,599 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల కంటే 8 ప్రైవేట్ పాఠశాలల్లోనే 1,283 మంది ఎక్కువగా ఉండడం ప్రభుత్వ విద్యావ్యవస్థపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. విశ్వనాథపురం పెద్ద అని ప్రైమరీ స్కూల్లో 1 విద్యార్థి, ప్రైమరీ స్కూల్ రఘునాథగూడెంలో 2, ఎర్రబోయినపల్లిలో 5, పాయపూరులో 5, బత్తులపల్లిలో 6, ఎర్రబంజరలో 9 మంది మాత్రమే చదువుతున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలలు ఈ స్థాయికి చేరుకోవడం గ్రామీణ విద్యావ్యవస్థకు ప్రమాద సంకేతంగా విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. 1 నుండి 7 వ తరగతి వరకు ఉన్న లక్ష్మీపురం పాఠశాలలో 8 మంది, హనుమతండాలో 13 మంది, చైతన్యనగర్‌లో 14 మంది, ఎన్టీఆర్ కాలనీలో 13 మంది, లోకారంలో 24 మంది, పుల్లయ్య బంజరలో 25 మంది, వాచ్య నాయక్ తండాలో 25 మంది, రఘునాథ్ బంజరలో 29 మంది, కొర్లగూడెంలో 33 మంది విద్యార్థులతోనే తరగతులు కొనసాగుతున్నాయి. మండలంలోని తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కలిపి కూడా విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో లేదు. 6 నుండి 10 వ తరగతి వరకు నిర్వహించబడుతున్న ప్రభుత్వం హై స్కూల్ పేరువంచలో 7 మంది ఉపాధ్యాయులతో ఒక వ్యాయామ ఉపాధ్యాయులు తో 45 మంది విద్యార్థులు, చెన్నూరులో 128 మంది, చిన్న కోరుకొండిలో 157 మంది, వెన్నవల్లిలో 38 మంది, ఎర్రబోయినపల్లిలో 41 మంది, బత్తులపల్లిలో 40 మంది, కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 245 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 202 మంది, చంద్రుపట్లలో 75 మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు ఉన్న విద్యార్థుల లేక తరగతి గదులు వెలవెల లాడుతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలు అమల్లో ఉన్నప్పటికీ, తల్లిదండ్రులు ఎందుకు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉపాధ్యాయుల కొరత, బహుళ తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించడం, మౌలిక వసతుల లోపం, నాణ్యమైన బోధనపై ఉన్న సందేహాలు వంటి అంశాలు దీనికి కారణాలుగా విద్యావేత్తలు పేర్కొంటున్నారు. 60 ప్రభుత్వ పాఠశాలల్లో 2,316 మంది... కేవలం 8 ప్రైవేట్ పాఠశాలల్లో 3,599 మంది... అనే గణాంకాలు ఒక మండలానికే పరిమితం కాకుండా ప్రభుత్వ విద్య ఎదుర్కొంటున్న సవాళ్లకు అద్దం పడుతున్నాయి. ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన బోధనపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని విద్యావేత్తలు, మేధావి వర్గము హెచ్చరిస్తున్నారు.

---

# ఆర్వోబీ నిర్మాణంలో జాప్యంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అసంతృప్తి



**ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టవా? అంటూ అర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్లపై అసహనం**

**భూసేకరణలో జాప్యంవల్లే పనుల**

**ఆలస్యమైందని అధికారుల వివరణ**

**బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వలేదని వెల్లడి**

**తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని మేయర్ ను కోరిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**హుటాహుటిన తీగలగుట్టపల్లి ఆర్వోబీ**

**వద్దకు వెళ్లిన మేయర్, కమిషనర్**

**మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను చేపట్టాలని మేయర్ కొలగాని నిర్ణయం**

**కరీంనగర్ జూలై 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోని తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణ పనుల్లో జాప్యంతోపాటు రవాణా రాకపోకలు, స్థానిక ప్రజలకు నిత్యం ఇబ్బందులు కలుగుతుండటంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా వృద్ధురాలు ఆర్వోబీ సమీపంలోని కల్వర్టులో పడిపోయారనే సమాచారం రావడంతో అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై బండి సంజయ్ అసహనం వ్యక్తం చేశారు. ఆర్వోబీ నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని వారిని ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణ పనుల్లో జాప్యాన్ని తప్పుపట్టారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ మాట్లాడుతూ తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. గత ప్రభుత్వం భూసేకరణ చేయలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం భూసేకరణపై దృష్టి పెట్టిందని, త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఆర్వోబీ నిర్మాణ పనుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణం చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడంతో ఆయా పనులు ఆగిపోయాయయన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈరోజు ఉదయం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో న్యూఢిల్లీ నుండి ఫోన్లో




మాట్లాడారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ వద్ద బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ హుటాహుటిన తీగలగుట్టపల్లి ఆర్వోబీ వద్దకు వెళ్లారు. ఆర్వోబీ సమీపంలోని కల్వర్టును పరిశీలించారు. ఆర్వోబీ వద్ద రాకపోకలకు జరుగుతున్న ఇబ్బందులను గమనించారు. బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వనందున, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే ఆయా పనులను చేపట్టాలని నిర్ణయించారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఆయా పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి సేత బంధన్ స్కీం కింద కేంద్రమే పూర్తి స్థాయి నిధులను వెచ్చిస్తున్నప్పటికీ పనుల జాప్యానికి కారణాలేమిటని ఈ సందర్భంగా బండి సంజయ్ సంబంధిత కాంట్రాక్టర్ ను ప్రశ్నించడంతో "ఆర్వోబీ నిర్మాణ పనులకు సంబంధించి భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. భూసేకరణ విషయంలో గత ప్రభుత్వం తీవ్రమైన జాప్యం చేసినందున ఆర్వోబీ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది"అని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం భూసేకరణకు సిద్ధమైందని, అతి త్వరలోనే నోటిఫికేషన్ ను వెలువరించబోతుందని తెలిపారు. ఏదేమైననప్పటికీ రాబోయే 6 నెలల్లో ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి వన్ సైడ్ పనులను పూర్తి చేస్తామని చెప్పారు. దీంతోపాటు వచ్చే ఏడాది వరకు ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఒప్పందం ఉన్నందున, గడువులోగా రెండువైపులా ఆర్వోబీ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

---

# కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిపై బీజేవైఎం నిరసన..

**ఎన్నికల సందర్భంగా ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో కాంగ్రెస్ మాయమాటలు చెప్పింది.**

**నిరుద్యోగ భృతి అటకెక్కించింది... తూతూ మంత్రంగా నోటిఫికేషన్లు విడుదల చేస్తుంది...**

**ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని బీజేవైఎం నేతలు నేరెళ్ల ప్రవీణ్ రెడ్డి, సంగ నరేష్‌ల డిమాండ్....**




**కరీంనగర్ జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ, ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే నోటిఫికేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ వద్ద భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెళ్ల ప్రవీణ్ రెడ్డి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సంగ నరేష్ పాల్గొని ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. నిరుద్యోగ భృతిని రెండున్నర ఇలా ఇవ్వకుండా నిరుద్యోగ సమాజాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డీఎస్సీ ఇస్తామని నమ్మించి,నేడు ప్రకటించిన పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ అంశంలో కూడా నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. నిరుద్యోగుల ఆశలను కాంగ్రెస్ వమ్ము చేసిందని , తూ తూ మంత్రంగా నోటిఫికేషన్లు విడుదల చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటమడుతుందని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి నిరుద్యోగికి న్యాయం జరిగేలా వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగుల ఆశలతో ఆడుకుంటున్న ప్రభుత్వ వైఖరి మారకపోతే, రాబోయే రోజుల్లో యువతను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ,జిల్లా ప్రధాన కార్యధర్శి ఎడవెల్లి శశిధర్ రెడ్డి,నక్క ప్రమోద్,గుర్రం వెంకటేష్ గౌడ్,చిక్కుల కిరణ్,గడ్డం అరుణ్,మణిదీప్,రాహుల్ రెడ్డి,జాగిరి రాజేందర్ లతోపాటు బీజేవైఎంనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.




# రూ.26 లక్షల ఇంటి చోరీ కేసును ఛేదించిన కరీంనగర్ రూరల్ పోలీసులు




**- ఒక నిందితుడు అరెస్ట్.. రూ.17.60 లక్షల నగదు, కారు స్వాధీనం**

**కరీంనగర్,జూలై30(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ పోలీసులు భారీ ఇంటి చోరీ కేసును విజయవంతంగా ఛేదించి ఒక నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదు, చోరీకి ఉపయోగించిన స్విఫ్ట్ కారు, ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితురాలు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం, ఫిర్యాదుదారుడు గుడిమల్ల శ్రీనివాస్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కరీంనగర్‌లోని అద్దె ఇంట్లో దాచిపెట్టిన రూ.26 లక్షల నగదును ఆయన చిన్ననాటి స్నేహితుడే అయిన తగరం శంకర్ లాల్ చోరీ చేసినట్లు దర్యాప్తులో తేలింది. వ్యవసాయ భూమి విక్రయించి పెద్ద మొత్తంలో నగదు ఇంట్లో ఉంచిన విషయం, ఇంటి నిర్మాణం, అదనపు తాళంచెవి ఉంచే ప్రదేశం వంటి వివరాలు ముందే తెలిసి ఉండటంతో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శంకర్ లాల్ తన సహచరురాలు అడెపు రేష్మతో కలిసి చోరీకి పథకం రచించాడు.జూన్ నెలలో ఇద్దరూ ఇంటికి చేరుకుని, అదనపు తాళంచెవి కనిపించకపోవడంతో ప్రధాన ద్వారం, బాత్‌రూమ్ తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం ప్లాస్టిక్ డ్రమ్‌లో పాత బట్టలు, ఖాళీ సీసాల కింద దాచిన అట్టపెట్టెలో ఉన్న రూ.26 లక్షల నగదును అపహరించి అక్కడి నుంచి పరారయ్యారు. దర్యాప్తులో రేష్మ కూడా నేరానికి సహకరించినట్లు వెల్లడైంది. చోరీ అనంతరం శంకర్ లాల్ కొంత నగదును ఇతరులకు ఇచ్చి, కొంత తన అవసరాలకు ఖర్చు చేయగా, మిగిలిన మొత్తాన్ని తన వద్దే ఉంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే రేష్మకు కూడా వాటా ఇస్తానని హామీ ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది.ఇదే భవనంలో గతంలో జరిగిన ల్యాప్‌టాప్ చోరీ కేసులో పోలీసులు సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేస్తున్న విషయం తెలుసుకుని తమ కదలికలు కూడా బయటపడతాయనే భయంతో నిందితులు ఆందోళనకు గురైనట్లు పోలీసులు పేర్కొన్నారు. జూలై 29న బొమ్మకల్ బస్ స్టాప్ సమీపంలో వాహనాల తనిఖీల సందర్భంగా రూరల్ పోలీసులు తగరం శంకర్ లాల్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు నేరాన్ని అంగీకరించగా, పరారీలో ఉన్న రేష్మతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. గుర్తుపట్టబడిన నిందితుడు తగరం శంకర్ లాల్ (49), పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఏక్లాస్‌పూర్ గ్రామానికి చెందినవాడు. అతనిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న మరో నిందితురాలి కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు, రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి, ఎస్ఐ ఎ. లక్ష్మారెడ్డి మరియు వారి సిబ్బంది ఈ కేసును ఛేదించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ దర్యాప్తు బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు అధిక మొత్తంలో నగదు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను ఇళ్లలో నిల్వ ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పోలీసులు సూచించారు.

# కరీంనగర్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల ప్రారంభం..

**కరీంనగర్, జూలై 30(పిసిడబ్ల్యూ న్యూస్):** నగర ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ డా. బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించారు. అనంతరం మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. మొదటి దశలో కరీంనగర్‌వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్‌చింతకుంట, కరీంనగర్‌కొత్తపల్లి హవేలీ రూట్లలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నట్లు మంత్రి తెలిపారు. నగరంలో చాలా కాలంగా ఉన్న సిటీ బస్సుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు ఈ బస్సులు ఎంతో



ఉపయోగపడతాయని, చింతకుంట, ఓద్యారం, కొత్తపల్లి ప్రాంతాలతో పాటు విద్యాసంస్థలకు ప్రసిద్ధి చెందిన వాగేశ్వరి వైపు ప్రయాణించే వారికి ఈ సేవలు మరింత సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. భవిష్యత్తులో ప్రతిమ, చల్మడ, మానకొండూరు ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీలకు కూడా బస్సు సేవలను విస్తరిస్తామని, ప్రయాణికుల ఆదరణను బట్టి అదనపు బస్సులు, అవసరమైతే 24 గంటల సర్వీసులు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూట్లలో ఆర్టీసీ బస్సులు



నడుపుతున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు పెండింగ్ బకాయిలు కూడా చెల్లించినట్లు తెలి పారు. ప్రతి గ్రామానికి బస్సు చేరేలా చర్యలు తీసుకు ంటున్నామని, ప్రస్తుతం ఆర్టీసీ రోజుకు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ సుమారు 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తోందని మంత్రి వెల్లడించారు.

# మిషన్-80“ ప్రపంచ రికార్డు పోస్టర్ ఆవిష్కరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




**హైదరాబాద్, జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్)** :భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న “మిషన్-80“ ప్రపంచ రికార్డు ప్రయత్నం పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన కార్యాలయంలో గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. కరాటే రంగంలో విశేష సేవలందిస్తున్న వి. సుధాకర్ చేపట్టనున్న ఈ వినూత్న ప్రపంచ రికార్డు ప్రయత్నం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణమని పేర్కొన్నారు. సుధాకర్ విజయవంతంగా ప్రపంచ రికార్డు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. 09 ఆగస్టు 2026న ఉదయం 9 గంటలకు హైదరాబాద్, నారాయణగూడ లోని డా. జి.ఎస్. మెల్కోటే పార్క్ లో జరగనున్న ఈ కార్యక్రమంలో వి. సుధాకర్ కేవలం 8 నిమిషాల్లో 9 రకాల కరాటే బాడీ టెక్నిక్స్ ఉపయోగించి 80 షాబాద్ టైల్స్‌ను బద్దలు కొట్టి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నం భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నివాళిగా, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్న గౌడ్, జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి, ప్రపంచ రికార్డు ప్రయత్నకర్త వి. సుధాకర్, అమృత రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, క్రీడాభిమానులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ చారిత్రాత్మక ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# అవగాహనతోనే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట!

**షీ టీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ శివనాగుల శ్రీనివాస్, ఎయిడ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కె. శ్రీనివాస్**

**ఐక్యరాజ్యసమితి పిలుపుతో జూలై 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం**

**బాధితుల్లో 38 శాతం బాలలే ఉండటం ఆందోళనకరం**

**ఖమ్మం ప్రతినిధి, జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో నిశ్శబ్దంగా విస్తరిస్తున్న ‘మానవ అక్రమ రవాణా’ అనే వ్యవస్థీకృత నేరాన్ని సమర్థవంతంగా నిరోధించాలంటే నిరంతర అవగాహన, ప్రజల్లో చైతన్యమే ఏకైక మార్గమని షీ టీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ శివనాగుల శ్రీనివాస్, ఎయిడ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కె. శ్రీనివాస్ లు ఉద్ఘాటించారు. 2013 నుండి ఐక్యరాజ్య సమితి ప్రకటించిన ‘ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం’ (జూలై 30) సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్




డెవలప్మెంట్, పోలీస్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఎయిడ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కె. శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ శివనాగుల శ్రీనివాస్ లు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా మానవ అక్రమ రవాణా ఏటా 236 బిలియన్ డాలర్ల అపారమైన అక్రమ వ్యాపారంగా రూపాంతరం చెందిందని, దీని తీవ్రతను ప్రతి ఒక్కరూ గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం బాధితుల్లో ఏకంగా 38 శాతం మంది చిన్నారులే ఉండటం హృదయవిదారకమని, బాధితుల్లో 71 శాతం మంది మహిళలు, యుక్తవయస్సు బాలికలే ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుత కాలంలో అక్రమ రవాణా కేవలం ప్రత్యక్షంగానే కాక, నకిలీ విదేశీ ఉద్యోగ ప్రకటనలు, క్రిప్టో కరెన్సీ ఆశలు చూపే సైబర్ మోసాల ద్వారా కూడా జరుగుతోందని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలు, వేధింపులు, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే డైల్



100, 1930 లలో పోలీసులను సంప్రదించాలని కోరారు. నాటికలు (స్కిట్స్) ద్వారా బాలబాలికలకు చైతన్యం కలిగించారు. ఆర్పిఎఫ్ సీఐ సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. కౌమార దశలోని యువత సామాజిక మాధ్యమాల్లో అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశయాలను అర్థం చేసుకుంటూ క్రమశిక్షణతో చదివి జీవితంలో రాణించాలని సూచించారు. బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ భారతరాణి: విద్య మాత్రమే మనిషిని ఉన్నత వ్యక్తిత్వం కలిగిన బాధ్యతాయుత పౌరుడిగా తీర్చిదిద్దుతుందని స్పష్టం చేశారు. చిన్నారులకు ఏమైనా సమస్యలు ఎదురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ను సంప్రదించవచ్చని తెలిపారు. ఏహెచ్‌టియు బాధ్యులు ఉదయ్ భాస్కర్, షీ టీమ్ కానిస్టేబుల్ రుక్మిణి, సభ్యులు రాందాస్, రవిచంద్ర, రవీంద్ర, భాస్కర్, పారాలిగల్ వాలంటీర్ మాధవిలత, నయాబజార్ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# సీరోల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించిన జిల్లా మెడికల్, హెల్త్ ఆఫీసర్ భుక్య రవి రాథోడ్





**సీరోలు జూలై 30(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం లో కొత్తగా నిర్మాణం చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ,జిల్లా మెడికల్, హెల్త్ ఆఫీసర్ భుక్య రవి రాథోడ్ పరిశీలించారు. ఏ ఈ పి ఆర్ , మాట్లాడుతూ మిగిలిపోయిన పనులు వారం రోజుల్లో పూర్తి అవుతాయని. ఆగస్టు మాసంలో రెండవ వారంలో శంకుస్థాపన కార్యక్రమము డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్. జాటోతు రామచంద్రనాయక్, చేతులు మీదుగా జరుగుతుందని తెలిపారు. త్వరితగతిన పనులను నాణ్యత ప్రమాణాలతో పాటించి పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించినారు కార్యక్రమానికి హాజరైన అధికారులు తహసిల్దార్ పూచందర్ మండల వైద్య అధికారి మౌనిక, కొరివి మండలము, గుగులోతు నరేష్, మండల వైద్యాధికారి, సిరోలు మండలం, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొనారు.

# ఆగస్టు 7న హైదరాబాద్‌లో పెన్షనర్ల మహాధర్నా

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య
- పీఆర్సీ, డీఏ బకాయిలు, హెల్త్ స్కీమ్ అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయనున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు
- డి.ఎస్. నకారా ఆశయాల స్ఫూర్తితో పోరాట శంఖారావం
- ‘రెండు వేల కోట్ల హెల్త్ ప్రీమియం ఎక్కడ?‘ పెన్షనర్ల ఆవేదన..
- గౌరవప్రద జీవనమే తమ న్యాయమైన హక్కని స్పష్టం

**ఖమ్మం ప్రతినిధి, జూలై 30 (పీసీడబ్ల్యూ న్యూస్) :** దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలో ప్రజలకు అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ప్రశాంత జీవితం గడపాల్సింది పోయి, తమ న్యాయమైన హక్కుల కోసం మరోసారి ఉద్యమ బాట పట్టాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 7న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఖమ్మంలో నిర్వహించిన పెన్షనర్ల పితామహుడు డి.ఎస్. నకారా వర్ధంతి సభకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ... మూడు సంవత్సరాలు గడిచినా కొత్త పీఆర్సీపై స్పష్టత లేకపోవడం, ఆరు విడతల డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉండటం, హెల్త్ కార్డులు, హెల్త్ స్కీమ్‌పై ప్రకటనలు మాత్రమే వచ్చి అమలులో మాత్రం కనిపించకపోవడం పెన్షనర్లను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తోందని అన్నారు. పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, 2024 మార్చి తర్వాత పదవీ








విరమణ చేసిన ఉద్యోగుల పెన్షన్ బకాయిల చెల్లింపు, ఆరోగ్య సేవలను సమర్థంగా అందుబాటులోకి తేవడం వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. హెల్త్ స్కీమ్ పేరిట మే నెల నుంచి పెన్షన్లు, వేతనాల నుంచి ప్రీమియం మినహాయిస్తున్నప్పటికీ, రెండు నెలలు గడిచినా కార్డులు అందించకపోవడం వల్ల వైద్య సేవలు అందక వేలాది మంది పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “పెన్షనర్ల నుంచి వసూలు చేసిన సుమారు రెండు వేల కోట్ల రూపాయల నిధులు ఎక్కడ? వాటిని ఎప్పుడు వినియోగిస్తారు?“ అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు జీవితాంతం పోరాడిన డి.ఎస్. నకారా ఆశయాలే తమ ఉద్యమానికి స్ఫూర్తి అని పేర్కొన్న నాయకులు, ఆయన వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, జిల్లా అధ్యక్షుడు పరిశపుల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. పెన్షన్ అనేది దానం కాదు... జీవితాంతం చేసిన సేవకు లభించే గౌరవప్రదమైన హక్కు అని స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధిలో తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యోగులు వృద్ధాప్యంలో వైద్యం, ఆర్థిక భద్రత కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని అన్నారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం మానవీయ దృక్పథంతో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా శాఖ సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, ఊదుగు వెంకటేశ్వర్లు, జల్లా వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శులు బోజెడ్ల కృష్ణకుమారి, తాడి అంజలి, సీనియర్ పెన్షనర్లు చీదిరాల వెంకటేశ్వర్లు, రాయల వెంకటేశ్వర్లు, ఎస్‌కే అబ్దుల్ షరీఫ్, కార్యదర్శులు బెల్లం రాధాకృష్ణమూర్తి, గండ్లూరి కృష్ణారావు, పీవీఆర్‌కేవీ ప్రసాదరావు, కంచుమర్తి పుల్లయ్య, యండి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షపు నీటి ముంపు సమస్యను పరిష్కరించండి

**- మున్సిపల్ కమిషనర్‌కు బిజెపి నాయకులు తోట సాగర్ వినతి**




DATE: 30/7/26

గౌరవనీయులైన మున్సిపల్ కమిషనర్ గారికి,

కరీంనగర్ నగరపాలక సంస్థ

విషయము: ముందస్తు చర్యల్లో భాగంగా వర్షపు నీరు రోడ్లపై, ఇళ్లలోకి చేరుతుండటం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని వినతి.

గౌరవనీయ అయ్యా,

హౌసింగ్ బోర్డు కాలనీ 7వ డివిజన్ లోని రోడ్ నెంబర్ 2 శివాలయం ఏరియా మరియు పలు లోతట్టు ప్రాంతాల లో ప్రతి సంవత్సరం వర్ష కాలం లో ఈ ఇండ్లలోకి నీరు వెళ్లి చాలా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు హౌస్ నెంబర్ లు (5-7-338/7 నుండి 5-7-338/15,16,5-7-283) ఈ వినతిపత్రం ద్వారా మా ప్రాంతంలో ఎదురవుతున్న తీవ్రమైన వర్షపు నీటి సమస్యను ముందస్తు చర్యల్లో భాగంగా మీ దృష్టికి తీసుకువస్తున్నాము.

దయచేసి ముందస్తు చర్యలు తీసుకోగలరని మనవి.

మీ విధేయుడు

తోట సాగర్ B.J.P

7వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీ

సెల్:9299999319

INWARD SECTION

**కరీంనగర్ జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 7వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షాకాలంలో నీటి ముంపుతో ఎదురవుతున్న తీవ్ర ఇబ్బందులు సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం రోజున బిజెపి కాంటెస్టెంట్ కార్పొరేటర్ తోట సాగర్ మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. కాలనీలోని రోడ్ నంబర్ 2 శివాలయం ఏరియా పలు లోతట్టు ప్రాంతాలలో ప్రతి ఏటా వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడమే కాకుండా, నేరుగా ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.. ముఖ్యంగా హౌస్ నంబర్ 5-7-338/7 నుండి 5-7-338/15, 16 మరియు 5-7-283 ప్రాంతాలలోని ఇళ్లలోకి వర్షపు నీరు భారీగా వచ్చి చేరుతోందని, దీనివల్ల ఆ ప్రాంత ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ వర్షపు నీటిని మళ్లించడానికి చర్యలు తీసుకుని ఇళ్లలోకి నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని తోట సాగర్ వినతి పత్రంలో కోరారు.

# పేకాటలో పట్టుబడిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన పోలీస్ కమిషనర్

**వేంసూర్, జూలై 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జులై 19న వేంసూర్ మండలం అమ్మపాలెం గ్రామ శివారు ప్రాంతంలో కంచర్ల వెంకటేశ్వరరావు ఏ జయం, శ్రీహరి అనే ఆర్గనైజర్ల ఆద్వర్యంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై వేంసూర్ ఎస్సై కవిత, పోలీస్ సిబ్బంది దాడి చేసి 22 మంది పై కేసు నమోదు చేశారు. దాడిలో ఏఆర్ కానిస్టేబుల్, డ్రైవర్ సత్తుపల్లి టౌన్ పిఎస్ మహమ్మద్ ఇమ్రాన్ షరీఫ్ కూడా పట్టుబడ్డారు. దీంతో విధినిర్వహణలో నిర్లక్ష్యం, శాఖా పరమైన నియమాలను ఉల్లంఘించిన కారణంగా నిందితుడైన కానిస్టేబుల్ మహమ్మద్ ఇమ్రాన్ షరీఫ్ ను సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఉత్తర్వులు జారీచేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది:మంత్రి పొంగులేటి

**సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో**

**సుమారు 3,500 దరఖాస్తులు స్వీకరణ**

**భూ రీ-సర్వేతో ఏడాదిన్నరలో రెవెన్యూ**

**సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**అర్హులందరికీ దశలవారీగా**

**ఇందిరమ్మ ఇళ్లు మంజూరు**

**కల్లూరులో నిర్వహించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో పాల్గొన్న మంత్రి పొంగులేటి**



**కల్లూరు, జూలై 30 (పిసిడబ్ల్యూన్యూస్) :**ప్రజల సమస్యలను ప్రభుత్వం నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.కల్లూరు డీఎన్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం కల్లూరు, తల్లాడ మండలాలకు సంబంధించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మొత్తం సుమారు 3,500 దరఖాస్తులు అందాయని తెలిపారు.వాటిలో 1,800 ఇందిరమ్మ ఇళ్లకు, 500 వరకు రెవెన్యూ సమస్యలకు, 200 పెన్షన్లకు, ఇతర మిగతా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని చెప్పారు. ఇదే విధంగా పాలేరు నియోజకవర్గ ప్రజా దర్బార్‌లో 25 వేల దరఖాస్తులు అందగా, వాటిలో 13 వేల దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవేనని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గం సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఒకేసారి అందరికీ ఇళ్లు మంజూరు చేస్తే ఆర్థిక భారం పెరుగుతుందని, అందుకే దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపడుతున్నా మని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.8.5 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి రాజీ ఉండదన్నారు. సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో గత 50 సంవత్సరాలుగా ఉన్న రెవెన్యూ సమస్యలను భూ రీ-సర్వే ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సర్వే కొనసాగుతోందన్నారు. మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వే పూర్తి చేసి శాశ్వత పరిష్కారం అందిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు విచారణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. పేదల భూములు ఎలా కాజేయబడ్డాయో, భూముల మళ్లింపులు, ప్రభుత్వ భూముల అక్రమ బదిలీలు అన్నీ ప్రజలకు వెల్లడవుతాయని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. గత యాసంగి లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామని, ప్రతిపక్షాలు అనవసర రాజకీయాలు చేస్తున్నాయనివిమర్శించారు. ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని బీఎల్‌వోలకు ఆగస్టు 3లోపు తప్పనిసరిగా అందజేసి ఓటు హక్కును పరిరక్షించు కోవాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గ ప్రజాదర్బార్‌లో వచ్చిన 25 వేల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతోందని, సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో 3,500 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో గృహ నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయని చెప్పారు.మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి భూ సర్వే నిర్వహిస్తున్నా మని, ఇప్పటివరకు 2 వేల ఎకరాల్లో సర్వే పూర్తి చేసి త్వరలో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తును సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.దరఖాస్తుల్లో ఫోన్ నంబర్, ఆధార్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, పూర్తి సమాచారం ఉంటేనే సంబంధిత అధికారుల ద్వారా వేగంగా పరిష్కారం అందించ గలమని కలెక్టర్ సూచించారు.సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు ప్రజల వద్దకే రావడం ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రత్యేకత అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో భూ సర్వే వేగంగా సాగుతోందని, రెండు నెలల్లో పెండింగ్ రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ధరణి వల్ల భూములు కోల్పోయిన రైతులకు భూ భారతి ద్వారా న్యాయం జరుగుతోందని పేర్కొంటూ, సత్తుపల్లి నియోజకవర్గానికి అదనంగా 1,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.ప్రభుత్వం ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల లోపు రుణ మాఫీ, విద్యార్థులకు యూనిఫాంలు, ఉచిత అల్పాహారం, వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రూ.15 కోట్లతో మున్సిపల్ అభివృద్ధి పనులు, సత్తుపల్లిలో రూ.25 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు మున్సిపాలిటీకి అదనంగా రూ.20 కోట్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ, కల్లూరు మునిసిపాలిటీ చైర్మన్ మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా,మండల స్థాయిలో విపత్తుల నివారణ కమిటీలు ఏర్పాట్లు చేయాలి**

**జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ నెంబర్ 7995074803**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్ జిల్లా జూలై 30(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో వాతావరణ శాఖ సూచనల ప్రకారం రానున్న రెండు , మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున జిల్లా వ్యాప్తంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, జిల్లాస్థాయి, మండల స్థాయిలో విపత్తుల నివారణ కోసం వెంటనే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, అందులో మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, (పోలీస్), మున్సిపల్ కమిషనర్లు, తదితరులు ఉండాలని స్థానిక పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ మీడియాకు సమాచారం అందించాలని,గ్రామాలు, పట్టణాలలో పాత భవనాలను గుర్తించాలని శిథిలవస్థలో ఉన్న భవనాల యజమానులకు నోటీస్ ఇచ్చి అవసరమైతే వారిని ఇతర ప్రదేశాలకు తరలించాలని, గ్రామాలు పట్టణాల వారీగా పూర్తి వివరాలను అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు,జిల్లాలో ప్రవహిస్తున్న వాగులు, చెరువులు, కుంటల యొక్క స్థితిగతులను ఇరిగేషన్ శాఖ వారు ఎప్పటికప్పుడు గమనిస్తూ నివేదికలు ప్రతిరోజు ఇవ్వాలని, జిల్లా వ్యాప్తంగా పశుసంపద, పంటలు, ప్రజలకు, ఆస్తి, ఇతర నష్టాలు జరగకుండా ముందస్తు పక్క ప్రణాళికలతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు,క్షేత్రస్థాయిలో ఎలాంటి విపత్తులు, బ్రీచెస్, ఇతర నష్టాలు ఏమి జరిగినా అన్ని విభాగాల సంబంధిత అధికారులు తక్షణమే వేగంగా జిల్లా యంత్రాంగానికి తెలియపరచాలని అందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకోసం ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలలో ఈ కార్యక్రమాలను నిర్వహించి నివేదికలు సమర్పించాలని, ప్రతి కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సూచించారు,మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నిటిని అందించాలని, పంట మార్పిడి ద్వారా చేస్తున్న లెమన్ గ్రాస్, కూరగాయలు, తదితర పంటల సాగుపై పూర్తిస్థాయిలో నివేదికలు అందించాలని, ఫైర్, పోలీస్ విభాగల ద్వారా జిల్లాలో వరదల వర్షాల కారణంగా తీసుకోవలసిన చర్యల కోసం సిద్ధంగా ఉండాలని, మామునూరు బెటాలియన్ కు సంబంధించి జిల్లాకు వచ్చేవారి వివరాలను సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలని, వర్షాల పరిస్థితులలో సహాయక చర్యల కోసం సామాగ్రిని ఇతర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలని లేని పక్షంలో తక్షణమే




ఖరీదు చేయాలని, జిల్లాలో చెరువులు ప్రభుత్వ భూముల అక్రమనలను వెంటనే అరికట్టాలని అట్టివారికి శాఖపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఇరిగేషన్, మున్సిపల్, తహసిల్దార్, అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు అధికంగా పడితే రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేయుటకు సిద్ధంగా ఉండాలని, బంధం చెరువు నిజాం చెరువు బతుకమ్మ కుంట తమ పరిధిలో ఉన్నటువంటి అన్ని వాటర్ వనరులను గమనిస్తూ ఉండాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు, రైల్వే లైన్లో వెంబడి వరద ప్రవాహాలను గమనిస్తూ ఉండాలన్నారు , పట్టణాలలో డ్రైనేజీ వ్యవస్థ ఇతర వరద వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై మాస్టర్ ప్లాన్స్ సిద్ధం చేసి ఉంచుకోవాలని, విపత్తుల ఆక్ట్ ప్రకారం తీసుకోవాల్సిన అన్ని చర్యల కోసం సిద్ధంగా తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రాత్రికి రాత్రే అధిక వర్షాలు పడే సూచనలు ఉన్నందున మండల స్థాయి లో ప్రత్యేక విపత్తుల నివారణ కమిటీలు ఏర్పాటు చేసుకొని సమావేశాలు నిర్వహించాలని, సమస్యాత్మక చెరువులను, కెనాలను, కాలువలను పర్యటక ప్రదేశాలలో ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలని గట్టి భద్రతను నిర్వహించాలని, స్థానిక మండల ప్రజలకు మీడియా వారికి ముందస్తు సమాచారంతో అవగాహన కల్పించాలని, జిల్లాలో ప్రవహిస్తున్న వాగుల యొక్క పరిస్థితులను నిత్యం గమనిస్తూ ఉండాలని, అవసరం అయితే మత్స్యకారులు, బోట్స్ ను సిద్ధంగా ఉంచుకోవాలని, స్థానిక తహసీల్దారులు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ ఇరిగేషన్ పంచాయతీరాజ్ మున్సిపల్ అన్ని విభాగాల వారు సమన్వయంతో కలిసి విపత్తులను ఎదుర్కోవడానికి కోసం సిద్ధంగా ఉండాలని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్ఓ నాగలక్ష్మి, డిపిఓ రేవంత్, వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జి. మరియాన్న, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఇరిగేషన్ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం.. బాధ్యులపై కఠిన చర్యలు!

● ధరణి మోసాల వెనుక ఉన్న నిజాలు త్వరలోనే బయటపెడతాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ● పేదల భూములు కాజేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు అని ప్రకటన



**కల్లూరు, జులై 30 (పిసిడబ్ల్యూన్యూస్) :**ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ అక్రమాలను సమూలంగా వెలికితీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం కల్లూరులోని డీఎన్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని, ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. **- ధరణి అక్రమాలు బాహ్య ప్రపంచానికి వెల్లడిస్తాం** ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ధరణి వ్యవస్థను ఆసరాగా చేసుకుని అనేక అక్రమాలు, భూముల మళ్లింపులు, ప్రభుత్వ భూముల అక్రమ బదిలీలు జరిగాయని తెలిపారు. పేదల భూములను ఎలా కాజేశారో సమగ్ర విచారణ ద్వారా ఆధారాలతో సహా త్వరలోనే ప్రజల ముందుకు తెస్తామన్నారు. ఎంతటి వారైనా సరే తప్పు చేసిన వారిని వదిలిపెట్టేది లేదని, కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. **50 ఏళ్ల రెవెన్యూ సమస్యలకు పరిష్కారం** సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో గత 50 ఏళ్లుగా నలుగుతున్న భూ సమస్యలను సమగ్ర భూ రీ-సర్వే ద్వారా పరిష్కరిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి చేసి రైతులకు, భూయజమానులకు శాశ్వత పరిష్కారం అందిస్తామన్నారు.ఈ ప్రజాదర్బార్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దేశంలో విమాన ఛార్జీలపై నియంత్రణేది?

**ధరలు విపరీతంగా పెరగడానికి గల కారణాలేంటి..?**

**జలజీవన్ మిషన్‌లో తెలంగాణలోని గ్రామీణ గృహాలకు నల్లా కనెక్షన్ల పరిస్థితి ఎలా ఉంది?**

**లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నలు**

**సమాధానాలిచ్చిన కేంద్ర మంత్రులు మోహోల్, వి. సోమన్న**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 30 (పీసీడబ్ల్యూ న్యూస్) :** దేశంలో విమాన సర్వీసుల ధరల పెరుగుదల, ప్రయాణికుల నుంచి వస్తున్న ఫిర్యాదులు అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తీరుతెన్నులపై... పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి గురువారం ప్రశ్నించారు. విమాన ఛార్జీలు విపరీతంగా పెరగడానికి గల కారణాలేంటి? అని ఆరా తీశారు. దీనికి కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. **అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా..** మార్కెట్ డిమాండ్, సీజనాలిటీ మరియు అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ఎయిర్‌లైన్స్ స్వయంగా ఈ డైనమిక్ ధరలను నిర్ణయిస్తాయని మంత్రి స్పష్టం చేశారు. తక్కువ ఛార్జీల టికెట్లు అమ్ముడైపోయిన కొద్దీ ధరలు పెరుగుతాయని,ప్రయాణికులకు అందుబాటు ధరలు కల్పించేలా డైనమిక్ ప్రైసింగ్ ఫ్రేమ్‌వర్క్ పని చేస్తుందని తెలిపారు. **ఛార్జీల పర్యవేక్షణకు డీజీసీఏ** ఎయిర్‌లైన్స్ సంస్థలు తాము ప్రకటించిన పరిమితిని మించి అధిక ఛార్జీలు వసూలు చేయకుండా పర్యవేక్షిం చేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 'టారిఫ్ మానిటరింగ్ యూనిట్' ఏర్పాటు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ఎంపిక చేసిన 78 రూట్లలో విమాన ఛార్జీలను పరిశీలిస్తుందని పేర్కొంది. **అధిక ఛార్జీలపై ఫిర్యాదుకు.. ఎయిర్ ఫేర్ గ్రీవెన్స్** అధిక ఛార్జీలపై ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారానికి జూలై 2025 నుంచి 'ఎయిర్‌సేవా' ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేకంగా 'ఎయిర్ ఫేర్' గ్రీవెన్స్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. దీని ద్వారా జూలై-డిసెంబర్ 2025లో 394 ఫిర్యాదులు, జనవరి నుంచి జూలై 2026 వరకు 315 ఫిర్యాదులు అందగా వాటిని పరిశీలించినట్లు ప్రభుత్వం పేర్కొంది. **'జల్ జీవన్ మిషన్' అమలు తీరుపై మరో మంత్రి సమాధానమిస్తూ..** జలశక్తి శాఖ సహాయ మంత్రి వి. సోమన్న వివరాలు అందజేశారు. ఆరంభంలో దేశవ్యాప్తంగా కేవలం 3.24 కోట్లు (16.72%) ఉన్న గ్రామీణ కుళాయి కనెక్షన్లు, జూలై 18, 2026 నాటికి 15.89 కోట్లకు (82.09%) చేరుకున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ కింద మొత్తం 53,98,219 గ్రామీణ కుటుంబాలకు వంద శాతం నల్లా కనెక్షన్లు అందించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఒక్క కుటుంబం కూడా కుళాయి కనెక్షన్‌కు దూరంగా లేదని కేంద్రం స్పష్టం చేయగా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 95, 53,387 కుటుంబాలకు గాను ఇప్పటివరకు 72,10, 929 కనెక్షన్లు ఇచ్చామని, ఇంకా 23,42,458 కుటుం బాలకు కనెక్షన్లు అందాల్సి ఉందని వెల్లడించారు.

# ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్



చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు జాక్‌పాట్ తగిలింది. తంతే బూరెల బుట్టలో పడ్డట్టు.. ఏకంగా ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ పదవి వరించింది. 18 ఏళ్ల తర్వాత ఫ్లెమింగ్‌పై సీఎస్‌కే వేటు వేగయా.. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు.. హెడ్ కోచ్‌గా స్వాగతం పలికింది. ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ సారథిగా తిరిగి జోరూట్‌ను ఎంపిక చేసింది.బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికడంతో అనుభవం కలిగిన జోరూట్‌కే ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) మళ్లీ సారథ్య బాధ్యతలు కట్టబెట్టింది. బ్రెండన్ మెక్‌కల్లమ్ స్థానంలో స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్ట్ టీమ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు ఈసీబీ గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ బోర్డు ప్యానెల్ ఏకగ్రీవంగా ఆమోదించిందని పేర్కొంది. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన కోచ్‌ల్లో ఒకరైన ఫ్లెమింగ్ రాకతో టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు ఒక కొత్త శకం మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంగ్లండ్ టెస్ట్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ఫ్లెమింగ్ తెలిపాడు. 'టెస్ట్ కోచ్‌గా ఇంగ్లండ్ జట్టులో చేరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కోచింగ్ పదవుల్లో ఇది ఒకటి. అలాంటి పదవి బాధ్యతలను చేపట్టడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఆటగాళ్లతో పని చేయడానికి, బ్రెండన్ మెక్‌కల్లమ్, బెన్ స్టోక్స్ సాధించిన ప్రగతిని కొనసాగించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక ప్రణాళికలతో జట్టుకు విజయాలను అందించే ప్రయత్నం చేస్తాం. జట్టులోని యువ ప్రతిభావంతులకు సాయం చేయడమే మా ప్రధాన లక్ష్యం.'అని ఫ్లెమింగ్ చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ అయిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల సేవలందించాడు. ఈ 18 సంవత్సరాల్లో 10 సార్లు జట్టును ఫైనల్‌కు చేర్చడంతో పాటు ఐదు టైటిళు అందించాడు. సీఎస్‌కేకు చెందిన ఇతర గ్లోబల్ ఫ్రాంచైజీలకు కూడా కోచ్‌గా సేవలందించాడు. న్యూజిలాండ్ కెప్టెన్‌గా 80 మ్యాచ్‌ల్లో 28 విజయాలు అందించాడు. కౌంటీ క్రికెట్‌లో నాటింగమ్‌షైర్ జట్టుకు సారథిగా వ్యవహరించి 2005 కౌంటీ ఛాంపియన్‌షిప్ టైటిల్ అందించాడు. 2017 నుంచి 2022 వరకు కెప్టెన్‌గా కొనసాగిన జోరూట్ తిరిగి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. గతంలో 64 టెస్ట్‌ల్లో జోరూట్ 27 విజయాలు అందించాడు. ఇంగ్లండ్ సారథ్య బాధ్యతలను తిరిగి చేపట్టడం గర్వంగా ఉందని జోరూట్ తెలిపాడు. ఈ బాధ్యతల్లో కొనసాగడం ఎంతో కష్టమైనప్పటికీ.. సంతృప్తినిస్తోందని చెప్పాడు. స్టీఫెన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని వెల్లడించాడు.



# అంతర్జాతీయ క్రికెట్‌కు అజింక్య రహానే గుడ్‌బై..

భారత స్టార్ బ్యాటర్, మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతూ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నాడు. టీమిండియా మాజీ వైస్ కెప్టెన్, క్లాసిక్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతూ గురువారం సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ వీడియో ద్వారా రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. జీవితంలో సరైన సమయం వచ్చినప్పుడు దాన్ని గౌరవించి ముందుకు సాగక తప్పదని ఈ సందర్భంగా అతడు ఉద్వేగభరితంగా పేర్కొన్నాడు. తనకు అండగా నిలిచిన బీసీసీఐకి, తన తోటి ఆటగాళ్లకు, కోచ్‌లకు, కోట్లాది మంది అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. 2011లో ఇంగ్లండ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన రహానే, ఆ తర్వాత కొన్ని రోజులకే రాహుల్ ద్రావిడ్ ఫేర్‌వెల్ సిరీస్‌లో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక 2013లో ఢిల్లీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. విరాట్ కోహ్లీ, పుజారాలతో కలిసి మిడిలార్డర్‌లో భారత జట్టుకు బలమైన వెన్నెముకగా నిలిచాడు. కఠినమైన విదేశీ పిచ్‌లపై అతడు ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆస్ట్రేలియా గడ్డపై 2020–21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును ముందుండి నడిపించిన తీరు అతడి కెరీర్‌లోనే ఒక సువర్ణాధ్యాయం. కోహ్లీ గైర్హాజరీలో జట్టు బాధ్యతలు చేపట్టి, యువ ఆటగాళ్లతో అద్భుతాలు సృష్టించాడు. మెల్‌బోర్న్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి జట్టుకు చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించాడు. ఆ సిరీస్ అతడి నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి చాటిచెప్పింది. భారత్ తరపున 85 టెస్టులు ఆడిన రహానే 5077 పరుగులు సాధించాడు. అలాగే 90 వన్డేల్లో 2962 పరుగులు, 20 టీ20 మ్యాచుల్లో 375 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. జులై 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచే అతడి కెరీర్‌లో ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, ఐపీఎల్ లాంటి ఫ్రాంచైజీ లీగ్స్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో తాను కొనసాగుతానని రహానే స్పష్టం చేశాడు. ఈ ఏడాది ఐపీఎల్ 2026లో కూడా అతడు ఆడాడు. పదేళ్లకు పైగా తన అద్భుత ఆటతో కోట్లాది మంది మనసులు గెలుచుకున్న ఈ సైలెంట్ వారియర్ రిటైర్మెంట్ వార్త అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

# భారత హాకీ కిట్ కలర్ మార్పుపై రచ్చ!




భారత హాకీ జట్ల జెర్సీ రంగును బ్లూ నుంచి కాషాయ రంగుకు (ఆరెంజ్) మార్చడంపై మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హాకీ ఇండియా స్పష్టం చేసింది. వచ్చే నెలలో బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026 కోసం భారత పురుషుల, మహిళల జట్లు సిద్ధమవుతున్నాయి. ఈ మెగా టోర్నీ కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) జాతీయ జట్ల జెర్సీ రంగును అనూహ్యంగా మార్చేసింది. దశాబ్దాలుగా భారత జట్టుకు ఐడెంటిటీగా ఉన్న సంప్రదాయ బ్లూ జెర్సీ స్థానంలో కొత్తగా కాషాయం (ఆరెంజ్) రంగు కిట్‌ను పరిచయం చేసింది. ఈ నిర్ణయంపై భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జెర్సీ రంగు మార్చడం వెనుక ఉన్న లాజిక్ ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ రంగు మార్పుపై సోషల్ మీడియాలో సైతం పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా సీనియర్ అధికారి ఒకరు.. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని కొట్టిపారేశారు. జాతీయ జెండాలో కాషాయం ఒక భాగమని, మార్పును ఎప్పుడూ స్వాగతించాలని ఆయన సూచించారు. సంప్రదాయ బ్లూ జెర్సీని మార్చడానికి ప్రధాన కారణం ఆటగాళ్ల విజిబిలిటీ అని ఆ అధికారి వివరించినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు ఎక్కువగా బ్లూ టర్ఫ్ (మైదానం) పైనే జరుగుతున్నాయి. మైదానం రంగు, జెర్సీ రంగు ఒకేలా ఉండటం వల్ల ఆటగాళ్లను గుర్తించడం వీక్షకులకు కష్టంగా మారుతోంది. ఆరెంజ్ రంగు వల్ల కాంట్రాస్ట్ పెరిగి, టర్ఫ్‌పై ఆటగాళ్లు స్పష్టంగా కనిపిస్తారని ఆయన పేర్కొన్నారు. కొత్త కిట్‌ను ఆవిష్కరిస్తూ హాకీ ఇండియా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. జెర్సీలోని ప్రతి కుట్టు ఒక కథను చెబుతుందని, ప్రతి రంగు దేశ గర్వాన్ని చాటుతుందని పేర్కొంది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయాలకు ప్రతీక అని వెల్లడించింది. ఉదయిస్తున్న సూర్యుడి స్ఫూర్తితో రూపొందించిన ఈ డిజైన్ సరికొత్త ఆరంభానికి సంకేతమని వివరించింది. ఇందులో తెలుపు రంగు ప్రత్యామ్నాయ జెర్సీలు కూడా ఉంటాయి. జెర్సీ మార్పు నిర్ణయం తనకు ఎంతో ఇబ్బందికరంగా అనిపించిందని వీరేన్ రస్కిన్హా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత జట్టు వారసత్వం, గుర్తింపు ఎప్పుడూ 'బ్లూ' రంగుతోనే ముడిపడి ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఎన్నో ఏళ్ల పాటు గర్వంగా బ్లూ జెర్సీ ధరించానని, అభిమానులు కూడా మన జట్టును ఆ రంగులోనే చూడాలని కోరుకుంటారని అభిప్రాయపడ్డారు. తన వాదన కేవలం జాతీయ జట్టు గుర్తింపు, వారసత్వం గురించేనని రస్కిన్హా స్పష్టం చేశారు.


# లాంగ్ జంప్‌లో శ్రీశంకర్‌కు సిల్వర్



- పారా అథ్లెటిక్స్‌లో డబుల్ డిలైట్
- 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలు

**గ్లాస్గో (స్కాట్లాండ్):** 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు మరో పతకం లభించింది. కేరళ అథ్లెట్ మురళీ శ్రీశంకర్ లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్‌తో మెరిశాడు. బుధవారం అర్ధరాత్రి అనంతరం జరిగిన పురుషుల లాంగ్ జంప్ ఫైనల్లో శ్రీశంకర్ 8.09 మీటర్ల జంప్‌తో ద్వితీయ స్థానంలో నిలిచాడు. భారత్‌కు చెందిన మరో అథ్లెట్ లోకేశ్ సత్యనాథన్ 7.97 మీటర్ల జంప్‌తో ఐదో స్థానంలో నిలిచి పతకానికి దూరమయ్యాడు. 2022 బర్మింగ్‌హామ్‌లో తొలిసారి బరిలోకి దిగి పతకం సాధించిన మురళీ శ్రీశంకర్.. కామన్‌వెల్త్ క్రీడల్లో వరుసగా రెండో మెడల్ సాధించాడు. జమైకా అథ్లెట్, మాజీ ప్రపంచ చాంపియన్ తజల్ గేల్ 8.15 మీటర్లలో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకం సొంతం చేసుకున్నాడు. 8.08 మీటర్ల జంప్‌తో స్కాట్లాండ్‌కు చెందిన స్టిఫెన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఫైనల్లో తొలి ప్రయత్నంలో 8.03 మీటర్ల జంప్ చేసిన మురళీ శ్రీశంకర్.. రెండో ప్రయత్నంలోనే 8.09 మీటర్ల పతక జంప్ చేశాడు. ఆ తర్వాత వరుసగా రెండు ప్రయత్నాలు ఫౌల్ కాగా.. చివరి రెండు ప్రయత్నాల్లో 7.94మీటర్లు, 7.97 మీటర్ల జంప్‌తో సరిపెట్టాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించినా గాయంతో దూరమైన మురళీ శ్రీశంకర్ తాజాగా గ్లాస్గోలో కామన్‌వెల్త్ క్రీడల సిల్వర్ మెడల్‌తో తనేంటో నిరూపించుకున్నాడు. ఇదిలా ఉండగా, భారత పారా అథ్లెట్లు ఒకే ఈవెంట్లో రెండు పతకాలు సాధించారు. పురుషుల 100 మీటర్ల టీ47 ఫైనల్లో దిలీప్ గవిట్, మహ్మద్ బసిల్‌లు సత్తా చాటారు. 10.71 సెకండ్లలో రేసును ముగించిన దిలీప్ బంగారు పతకం సాధించగా, 10.83 సెకండ్లతో మహ్మద్ బసిల్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో జాతీయ రికార్డు బద్దలుకొట్టిన పారుల్ చౌదరి 9.26.75 టైమింగ్‌తో ఐదో స్థానానికి పరిమితమై పతకం చేజార్చుకుంది.

# ఫైనల్‌లోకి దూసుకెళ్లిన నీరజ్ చోప్రా



స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్ ఎనిమిదో రోజు పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. భారత అథ్లెటిక్స్ జట్టుకు శుభవార్తగా, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతనితో పాటు భారత అథ్లెట్లు యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ కూడా ఫైనల్‌లోకి ప్రవేశించారు. దీంతో జావెలిన్ త్రో విభాగంలో భారత్‌కు పతక అవకాశాలు మరింత బలపడ్డాయి. ఈ విభాగానికి సంబంధించిన పతకాల పోటీలు జూలై 31న జరగనున్నాయి. ప్రస్తుతం కామన్వెల్త్ గేమ్స్‌లో అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, బాల్స్ పోటీలు కొనసాగుతుండగా, ట్రాక్ సైక్లింగ్‌లో కూడా భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. భారత క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు జావెలిన్ త్రో ఫైనల్‌పై కేంద్రీకృతమైంది. స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుడిగా భావిస్తున్న నీరజ్ చోప్రా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అంచనాలకు తగ్గ ప్రదర్శన చేయకపోయినా, ఫైనల్‌లోకి సులభంగా అర్హత సాధించాడు. జావెలిన్ త్రోలో నేరుగా ఫైనల్‌కు చేరాలంటే 85 మీటర్ల క్వాలిఫికేషన్ మార్క్‌ను అధిగమించాల్సి ఉంటుంది. అయితే తొలి ప్రయత్నంలో నీరజ్ 76.28 మీటర్లు మాత్రమే విసరగలిగాడు. దీంతో నేరుగా అర్హత సాధించే మార్క్‌ను అందుకోలేకపోయాడు. అయితే రెండో ప్రయత్నంలో తన ప్రదర్శనను మెరుగుపరుచుకున్న నీరజ్ 79.61 మీటర్లు జావెలిన్ విసిరి మొత్తం ఫలితాల్లో ఐదో స్థానంలో నిలిచాడు. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. భారత జట్టుకు చెందిన మరో ఇద్దరు జావెలిన్ త్రోయర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచారు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు, యశ్‌వీర్ సింగ్ 74.45 మీటర్లు నమోదు చేసి ఇద్దరూ ఫైనల్‌లో చోటు దక్కించుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో పాకిస్థాన్ ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ తొలి ప్రయత్నంలోనే విఫలమవడం ఆసక్తికరంగా మారింది. అనంతరం మూడు ప్రయత్నాలు పూర్తి చేసిన అతను గరిష్టంగా 78.63 మీటర్లు మాత్రమే నమోదు చేశాడు. ఫైనల్‌లో నీరజ్ చోప్రాకు అర్షద్ నదీమ్‌తో పాటు శ్రీలంకకు చెందిన యువ ప్రపంచ ఛాంపియన్ రుమేష్ పతిరాగేల నుంచి గట్టి సవాల్ ఎదురుకానుంది. ఈ ముగ్గురు మధ్య స్వర్ణ పతక పోరు ఉత్కంఠభరితంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు మహిళల 4000 మీటర్ల క్వాలిఫికేషన్ రేసులో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత అథ్లెట్ లీషా దాస్ 6:58.000 నిమిషాల్లో రేసును పూర్తి చేసినప్పటికీ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇంగ్లాండ్‌కు చెందిన మోర్గాన్ న్యూబెర్రీ కంటే ఆమె 1 నిమిషం 51 సెకన్లు వెనుకబడటంతో ఐదో స్థానానికి పరిమితమైంది. ఆస్ట్రేలియాకు చెందిన ఎరిన్ నార్మోయిల్ (5:24.264), ఇంగ్లాండ్‌కు చెందిన కదీనా కాక్స్ (6:37.119) ప్రదర్శనల నేపథ్యంలో లీషా ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. ఇదిలా ఉండగా, కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారులకు బుధవారం చారిత్రాత్మక రోజుగా నిలిచింది. భారత బాక్సర్లు ఏకంగా 10 పతకాలను ఖాయం చేయగా, లాంగ్ జంప్ స్టార్ మురళీ శ్రీశంకర్ కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో వరుసగా రెండు పతకాలు గెలిచిన తొలి భారత లాంగ్ జంపర్‌గా రికార్డు సృష్టించాడు.

# మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

### - ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన




ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్స్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.

# రామాయణ ట్రైలర్ విడుదల




### - అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ–రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది.

# నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైశ్వాల్..

కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిష్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్స్‌కు క్యాప్షన్ ఇచ్చింది.చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.



# విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2



అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్గ÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది

# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం




తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# లెనిన్ సరికొత్త రికార్డులు

### - వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

